క్లుప్తంగా

నేటి నుంచి పల్లె పండుగ

సదుం: మండలంలో సోమవారం నుంచి పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాజశేఖర్‌బాబు ఆదివారం తెలిపారు. 79ఏ చింతమాకులపల్లెలో ఉదయం 10 గంటలకు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమం 19వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

పశువధపై చర్యలు తీసుకోండి


డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నేతలు

పుంగనూరు: పుంగనూరు సంత నుంచి ప్రతి వారం 50 లారీల్లో పశువులను తరలిస్తూ పశువధ చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ ముక్తిమోర్చ రాష్ట్ర కార్యదర్శి అయూబ్‌ఖాన్ కోరారు. ఆదివారం పలమనేరు డీఎస్పీ ప్రభాకర్‌ను బీజేపీ నేతలు నరసింహులు కలసి వినతిపత్రం అందజేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

సదుం: మండల కేంద్రంలోని సాయిమందిరం అభివృద్ధికి ఆలయ ధర్మకర్త నాగభూషణంరెడ్డి, నాగరత్నమ్మ దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నమునుస్వామి, మేస్త్రీ నాగభూషణం, హరినాథ్, రామాంజులు, స్వామి పాల్గొన్నారు.

లారీలో మంటలు


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పుంగనూరు: పట్టణ సమీపంలోని భగత్‌సింగ్ కాలనీ వద్ద గల బైపాస్ రోడ్డులో ఓ లారీ టైర్ పగిలి మంటలు చెలరేగాయి. ఆదివారం ఉదయం ఈ సంఘటన జరగడంతో వెంటనే ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. లారీలో ఉన్న వస్తువులు, లారీ పాక్షికంగా కాలిపోయాయి.

వరసిద్ధుని సన్నిధిలో జేసీ


చిత్రపటం అందుకుంటున్న జేసీ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శనివారం జేసీ విద్యాధరి కుటుంబసభ్యులతోదర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితులు ఆశీర్వచనం పలికి, ప్రసాదాలు అందజేశారు.

సిరులు కురిపిస్తున్న చామంతి

పెద్దపంజాణి: కూరగాయల సాగులో కుదేలైన రైతులను చామంతి పూల సాగు ఆదుకుంటోంది. మండల పరిధిలో విస్తారంగా సాగు చేసిన చామంతి పూల ధరలకు రెక్కలు రావడంతో రైతుల కష్టాలు తీరినట్లు కనిపిస్తోంది. పండుగ సీజన్ కలసి రావడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది. ఈ ఏడాది చీడ పీడ సమస్యలు తక్కువగా ఉండడంతో పాటు దిగుబడి సైతం ఆశాజనకంగా ఉంది. దీంతో తమ కష్టాలు తీరనున్నాయని చామంతి పూలు సాగు చేసిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సాగు ఎక్కువగా ఉండే ప్రాంతాలివే..

మండలంలోని పడమటి ప్రాంతాలైన ముత్తుకూరు, పెద్దవెలగటూరు, రాజుపల్లి, కరసనపల్లి, పెద్దారికుంట, తూర్పు ప్రాంతాలైన నాగిరెడ్డిపల్లి, పెద్దకాప్పల్లి, వీరప్పల్లి, కొళత్తూరు, రాయలపేట పంచాయతీల్లో 140 ఎకరాల్లో పూలసాగు చేపడుతున్నారు.

అందుబాటులో మార్కెట్ ..


ముత్తుకూరు వద్ద చామంతి పూల తోట

పూల రైతులకు మార్కెట్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి. పంట కోతలను కోలారు, బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరి కొంత మంది విజయవాడకు వెళ్లి అమ్మకాలు సాగిస్తున్నారు. చాలా మంది పలమనేరులోనే చామంతి పూలను విక్రయిస్తున్నారు.

ఆశాజనకంగా ధరలు..



నేను 1.20 ఎకరాల్లో పసుపు చామంతి పూలు సాగు చేశాను. ఇప్పటి వరకూ రూ.లక్ష వరకు ఖర్చు చేశాను. మంచి దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో ధరలు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుతం కిలో రూ. 120–150 మధ్య అమ్మకాలు సాగుతున్నాయి. ధరలు ఇలాగే కొనసాగితే అన్ని ఖర్చులు పోను 4 నుంచి 5 లక్షల వరకూ ఆదాయం వస్తుంది.

-బసవరాజు, ముత్తుకూరు

పదేళ్లుగా పూలసాగు చేస్తున్నా..



గడచిన పదేళ్లుగా నేను పూలసాగు చేస్తున్నా. గడిచిన నాలుగైదు నెలలుగా చామంతి పూలకు మంచి ధరలు ఉన్నాయి. వ్యాపారులు తోటల వద్దకే వచ్చి పూలను కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు రాకపోతే బయట ప్రాంతాలకు వెళ్లి అమ్మకాలు సాగిస్తున్నాం. పూలసాగు వల్ల కుటుంబం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు సాగుతోంది.

సుబ్రమణ్యం, ముత్తుకూరు

పూల సాగుకు ప్రోత్సాహకాలు..

చామంతి, బంతి, గులాబిపూలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం తరపున ఎంఐడీహెచ్ పథకం కింద హెక్టారుకు రూ.16 వేలు ప్రోత్సాహకంగా అందజేస్తున్నాం. పాలీహౌస్‌లో సాగు చేసిన రైతులకు స్క్వేర్ మీటరుకు రూ.213 ఇస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

వరప్రసాద్, హెచ్‌ఓ, పుంగనూరు

14 దుకాణాలకు 158 దరఖాస్తులు

పుంగనూరు: పుంగనూరు ఎక్సైజ్ సర్కిల్‌లో పరిధిలోని 14 మద్యం దుకాణాలకు 158 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తులను 14న పరిశీలించి, లాటరీ ద్వారా షాపులు కేటాయిస్తారని పేర్కొన్నారు. చిత్తూరు, కాణిపాకం రోడ్డులోని సంతపేట వద్ద గల ఆర్‌ఆర్ గార్డెన్స్‌లో లాటరీ ద్వారా ఉదయం 7 గంటలకు ప్రారంభిస్తామని తెలిపారు. దరఖాస్తు దారులు అందరూ పాల్గొనాలని కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా ఏర్పాటైన రేవా (రాయల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్) గౌరవాధ్యక్షులు పార్థసారథి నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక కొంగారెడ్డిపల్లిలోని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో రేవా అసోసియేషన్ ఏర్పాటు, కార్యవర్గం ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు, ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగుల సంక్షేమం కోసం రేవా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ స్పందించి కృషిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడిగా పీఎంఆర్ ప్రభాకర్ (రిటైర్డ్ ఎంపీడీఓ), జనరల్ సెక్రటరీగా డీఆర్ మోహన్‌కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నరేష్‌బాబు, కోశాధికారిగా అగ్రహారం వెంకటేశులు, గౌరవ లీగల్ సెల్ అడ్వైజర్‌గా ప్రసన్నకుమార్, అసోసియేట్ అధ్యక్షులుగా వందవాసి వెంకటేశులు ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా సురేంద్రబాబు, యుగంధర్, చరణ్‌బాబు, జనార్దన్, సత్యనారాయణ, ఆదిమూర్తి, మురళీమోహన్ పాల్గొన్నారు.


నూతన రేవా అసోసియేషన్ నాయకులు

మండలంలో 'ఉసురు' షూటింగ్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉసురు అనే తమిళ సినిమా షూటింగ్ జరిగింది. నటి రాశితో పాటు పలువురు తమిళ నటీనటులతో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. మండలంలోని నల్లవెంకటయ్యగారిపల్లెలోని చెరువు వద్ద పలు సన్నివేశాలు, పెరుమాళ్లకండ్రిగ రోడ్డులో అంత్యక్రియల సన్నివేశాలు, తాళంబేడు ద్రౌపదమ్మ ఆలయం వద్ద మరి కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ షూటింగ్‌ను తిలకించేందుకు స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు వచ్చారు. రాశితోపాటు తమిళ నటులతో ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు.


నల్లవెంకటయ్యగారిపల్లె చెరువు వద్ద చేస్తున్న షూటింగ్

16లోపు దరఖాస్తు..

పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గంలో బాణసంచా వ్యాపారాలు నిర్వహించే దుకాణాదారులు తమ లైసెన్సుల కోసం ఈనెల 16లోపు దరఖాస్తు చేయాలని ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు ఆదివారం తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన వ్యాపారులు తమ పూర్తి వివరాలతో దరఖాస్తులు చేయాలన్నారు. అలాగే గతంలో బాణసంచా వ్యాపారాలపై కేసులు ఉంటే వాటికి సంబంధించి పోలీసుల క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను జతపరచి సమర్పించాలని కోరారు.

21లోపు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పుంగనూరు: డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు టెట్ అర్హత కలిగిన వారు ఈనెల 21లోపు ఉచిత శిక్షణకు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని సోషియల్ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహులు కోరారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీలో శిక్షణ కోసం దరఖాస్తు చేసే వారికి ఈనెల 27న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు. దీని ద్వారా శిక్షణ అభ్యర్థులను ఎంపిక చేసి వారికి మూడు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు భోజనం, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ట్రాన్స్‌కో ఈఈ బాధ్యతల స్వీకరణ

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా ట్రాన్స్‌కో నిర్మాణ విభాగం ఈఈగా అమర్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తిరుపతి ఎంఅండ్‌టీ విభాగం ఈఈగా ఉన్న ఆయన బదిలీపై చిత్తూరుకు వచ్చారు. స్థానిక గాంధీరోడ్డులోని నిర్మాణ విభాగం కార్యాలయంలో సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి పరిచయం చేసుకున్నారు. నూతన ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలియవచ్చింది.

వైద్యశిబిరం రేపు

పుంగనూరు: పుంగనూరు సమీపంలోని గూడూరుపల్లి వద్ద గల టిడ్కో గృహాల సముదాయంలో 15న ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆదివారం నిర్వాహకులు అయూబ్‌ఖాన్ తెలిపారు. కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి చెందిన వైద్యులతో అన్ని రకాల వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సద్వినియోగం చేసుకోండి

వి.కోట: సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సహచట్టం పరిరక్షణ సమితి అధ్యక్షుడు గిరిబాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని సహ చట్టం పరిరక్షణ సమితి కార్యాలయంలో 18వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రశ్నించి ప్రజాధనాన్ని రక్షించుకునే బాధ్యత ప్రజలకు ఉందన్నారు. రమేష్‌బాబు, శ్రీనివాసులు, సురేంద్ర, శివప్రసాద్, హరిప్రసాద్, బాలచంద్రబాబు, రామానుజులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు


సమావేశానికి హాజరైన పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

కల్లూరు(పులిచెర్ల): తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామని పాఠశాల పూర్వ విద్యార్థులు తెలిపారు. కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92వ బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం అక్కడ సమావేశమయ్యారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారు ఒకచోట చేరి తమపాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తాము చదివిన పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయం అందజేస్తామన్నారు. చంద్రశేఖరరెడ్డి, విజయకుమార్, అస్రూఫ్, మాలిక్, గోపి, షబ్బీర్, భాను, సుజాత, వసుంధర, శోభ పాల్గొన్నారు.

సాహితీ ప్రక్రియ ప్రగతికి మార్గం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): విప్లవ సాహితీ ప్రక్రియ ప్రగతికి మార్గం చూపుతుందని చిత్తూరు జిల్లా రచయితల సంఘ గౌరవాధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి అన్నారు. చిత్తూరు నగరం పీవీకేఎన్ సమీపంలోని మ్యాంగో భవన్‌లో శనివారం నెలవారి సాహితీ స్రవంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. 1887 నుంచి 1943 మధ్యకాలంలో మూఢనమ్మకాలు, వివాహ వ్యవస్థలు, దైవారాధన విషయాలపై చర్చించారు. వీటిలో అస్తవ్యవస్థ విధానాలు, మనుషుల ఆలోచన విధానాలు తనదైన భావ విప్లవ సాహిత్యం ద్వారా సంస్కరించడానికి పురాణాలు, ఇతిహాసాలు ముఖ్యమైన ఘట్టాలన్నారు. తనదైన విప్లవ సాహిత్య ప్రక్రియతో త్రిపురనేని రామస్వామి చౌదరి సమానత్వ వ్యవస్థ కోసం ఎనలేని కృషిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గిరిధరన్, ప్రధాన కార్యదర్శి సహదేవనాయుడు, కవులు మునస్వామి, అరుణకుమారి పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతకు పొంగళ్లు


పొంగళ్లు పెట్టడానికి వెళ్తున్న మహిళలు

చౌడేపల్లి: మండలంలోని పాలెంపల్లె గ్రామదేవత బోయకొండ గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని 50 కుటుంబాల మహిళలు భక్తిశ్రద్ధలతో గ్రామానికి సమీపంలోని అమ్మవారి ఆలయం వద్దకు చేరుకొని పొంగళ్లు పెట్టి పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

నిత్యాన్నదానానికి విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన నిత్యాన్నదాన ట్రస్ట్‌కు శనివారం చిత్తూరు నగరం మురకంబట్టు కోడిగుట్టకు చెందిన మోతీష్ రూ.1,01,116 విరాళంగా ఇచ్చారు. ఆయనకు ఆలయ అధికారులు స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది రవి పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న దాత కుటుంబసభ్యులు

ఉత్సవాలు పరిసమాప్తం

కాణిపాకం: కాణిపాకంలో శ్రీవరసిద్ధి వినాయక దేవస్థాన అనుబంధ మణికంఠేశ్వర స్వామి ఆలయంలో శనివారంతో నవరాత్రి ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. అమ్మవారికి ఉదయం అభిషేక పూజలు, సాయంత్రం ప్రత్యేక కుంకుమార్చనను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. నిష్టతో జమ్మిచెట్టుకు పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని మహిషాసురమర్దినిగా భక్తులను అనుగ్రహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కాణిపాక ఆలయ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామోత్సవంలో అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాలు పరిసమాప్తం





రాయలపేటలో గ్రామోత్సవం, మేలుమాయిలో.., అగరంలో తిమ్మరాయస్వామి, సదుం: ప్రత్యేకలంకరణలో సాయిబాబా


చౌడేపల్లెలో..


వి.కోటలో: దుర్గామాత ఆలయంలో జెడ్పీ చైర్మన్

పెద్దపంజాణి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. మండలంలోని పలు ఆలయాల్లో శనివారం విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాయలపేట గ్రామంలోని కోదండరామస్వామి ఆలయంలో సీతారామలక్ష్మణుల సమేత ఆంజనేయస్వామి విగ్రహాలను అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. శివాడి గ్రామంలోని కాళికాదేవిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలో మేలుమాయి క్రాస్‌లోని శ్రీమలాలమ్మ ఆలయంలో శనివారం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని మహిషాసురమర్ధిని అవతారంలో అలంకరించారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగింపుగా వైభవంగా పల్లకీసేవ నిర్వహించారు.

సదుంలో..

సదుం: మండల కేంద్రంలోని సాయిమందరంలో పాలాభిషేకం, అన్నదానం చేశారు. రెడ్డివారిపల్లె చామంతుల ఎల్లమ్మ, జాండ్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి, చెరువుముందరపల్లె చౌడేశ్వరీదేవి, పాపిరెడ్డిగారిపల్లె ఎల్లమ్మ దేవాలయాల్లో అభిషేకాలు చేశారు.

వి.కోటలో..

వి.కోట: స్థానిక దుర్గానగర్‌లో వెలసిన దుర్గామాత, కన్యకాపరమేశ్వరీ వీధిలో వెలసిన శ్రీవాసవీ మాతలు రాజరాజేశ్వరీ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామాత ఆలయంలో నిర్వహించిన పూజలకు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం దుర్గామాత ఉత్సవమూర్తులు పట్టణంలో ఊరేగించారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: బజారువీధిలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో నిర్వహించిన దసరా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం తోటోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ట్రాక్టర్‌లో నెమలి వాహనం ఆకారంతో చాందినీ బండిని ముస్తాబుచేశారు. అమ్మవారిని పట్టణంలోని పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి కర్పూరహారతులు పట్టి మహిళలు పూజలు చేశారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: అగరంలో తిమ్మరాయస్వామి, కనమనపల్లెలో శ్రీనివాసస్వామి, గుడుపల్లె వేంకటేశ్వర స్వామి, ఆలయాల్లో చివరిరోజు శనివారం స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు.

జలం.. ఫ్లోరైడ్ గరళం

మండలంలో ప్రజలకు సురక్షిత జలం కరువైంది. తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం పెరగడంతో ప్రజలకు వివిధ జబ్బుల బారిన పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో విధిలేక అందుబాటులో ఉంటున్న నీటినే అవసరాలకు వినియోగిస్తున్నారు. మరికొందరు మినరల్ వాటర్‌ను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా మండలంలో మినరల్ వాటర్ వ్యాపారం జోరందుకుంది.


గ్రామాల్లో విక్రయిస్తున్న వాటర్ క్యాన్లు

- నీటి కాలుష్యంతో పెరుగుతున్న రుగ్మతలు
- సురక్షిత నీటినే తాగాలంటున్న వైద్యులు

గుడిపాల: తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం పెరుగుతుండడంతో కాళ్ల వంకరలు, దంతాలు ఎర్రగా గారపట్టడం, పెరుగుదల లోపించడం వంటి సమస్యల బారిన పడుతున్నారు. ప్రజలకు తాగునీరు అందజేయాల్సిన కనీస బాధ్యతను ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి.

ట్యాంకుల్లో శుభ్రత ఏదీ ?

తాగునీరు సరఫరా చేస్తున్న ట్యాంకులను సరిగ్గా శుభ్రపరచకపోవడంతో ప్రజలు తరచూ డయేరియా బారిన పడుతున్నారు. ఆస్పత్రుల పాలై జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ట్యాంకులను క్లోరినేషన్ చేసి ప్రతి 15రోజులకొకసారి శుభ్రం చేయాలనే నిబంధనలు పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఫలితంగా కలుషిత జలం సరఫరా అయి ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు.

మినరల్ వాటర్ వైపు మొగ్గు చూపుతున్న ప్రజలు

నీటి కాలుష్యం నుంచి బయటపడేందుకు ఈమధ్య ప్రజలు మినరల్ వాటర్‌పై మొగ్గు చూపుతున్నారు. ఇళ్లలో అమర్చుకునేందుకు అనువుగా ఉన్న వివిధ నీటి శుద్ధీకరణ యంత్రాలను వాడుతున్నారు. మరి కొందరు మినరల్ వాటర్ క్యాన్లను ఇళ్లకు తెప్పించుకుంటున్నారు. మండలంలో సుమారు 45 శాతం మంది క్యాన్ వాటర్‌ను తాగుతున్నారంటే నీళ్ల ఇక్కడ ఎలా ఉంటున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

మినరల్ క్యాన్ శుభ్రమేనా?

ప్రభుత్వ నిబంధన మేరకు మినరల్ వాటర్ కేంద్రాన్ని నిర్వహించేందుకు అనుమతి ఉండాలి. నీళ్ల క్యాన్లను తరచూ శుభ్రపరుస్తూ ఉండాలి. ఐఎస్‌ఐ ముద్ర ఉన్న క్యాన్లనే వినియోగించాలి. కానీ మండలంలో క్యాన్ వాటర్ నిర్వాహకులు నీటి శుద్ధీకరణ విషయంలో నిర్దేశిత ప్రామాణికాలు పాటిస్తున్నారా, లేదా? అని అధికారులు ఎవరూ తనిఖీ చేసిన పాపానపోవడం లేదు. లాభాల కాంక్షతో నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సురక్షిత నీటినే తాగాలి

ట్యాంకుల శుభ్రం చేయకపోవడంతో ఫ్లోరైడ్ శాతం పెరిగి నీటికాలుష్యం అధికమవుతుంది. దీంతో వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన లేదా క్లోరిన్ మాత్రలతో శుద్ధిచేసిన లేక సురక్షిత మినరల్ వాటర్ అయినా తీసుకోవడం చాలా మంచిది.

–సంధ్య, వైద్యాధికారి, గుడిపాల